

# ఆగిసాగిన అడుగులు

నల్లూరి రుక్మిణి

అవి సంక్రాంతి రోజులు. పదిగంటలు దాటి పొద్దు పైకెక్కినా మంచు పొగ కమ్మి ఊరంతా మంపుమంపుగా మునగదీసుకున్నట్టే వుంది. బజారులన్నీ చెమ్మ చెమ్మగా వుండి ఇసుక, ఇటుకా అడ్డదిడ్డంగా పడి కలియతొక్కిన మట్టులాగా వున్నాయి.

ఓపక్క ఊరిపట్ల ఎవరికీ శ్రద్ధ లేనట్టుగా ఖాళీ జాగాలల్లో గబ్బు తుమ్మచెట్లూ, జిల్లేళ్లూ బలిసి పోయాయి. మరోపక్క సగం సగం కట్టుబడి చేసిన ఇందిరమ్మ ఇళ్లు వూరు ఎత్తిపోదని ఆశను కల్పిస్తూ కొత్తగా లేస్తున్నాయి.

చలిగాలికి కండవాలు భుజాల చుట్టూ కప్పుకుని మోకాళ్ల దగ్గరకు లాక్కుని ఓ నలుగురైదుగురు ముసలాళ్లు జెండా చెట్టు అరుగు మీద చేరారు. కళ్ల కింద ముడతలు తేలి, ముక్కుపుటాలూ, దవడలూ జారిపోయి- జీవం కోల్పోయినట్టున్న మొహాలతో, తలో దిక్కూ చూస్తూ గుప్పుగుప్పున చుట్టలు తాగడంలో నిమగ్నమయ్యారు.

"ఈరోజుల్లో వూరు ఇట్నేనా వుండేదీ? ఇళ్ల ముందు పేడనీళ్లు జల్లడం కూడా ముత్తకైపోయిందే..." నాగన్న ఎదురుగా కనిపిస్తున్న వాకిళ్ల వైపు చూస్తూ గొణుక్కున్నాడు.

ఇళ్లకు చేరే గింజాగిట్టతో బండ్ల మోతలూ, ఎద్దుల గంటల చప్పుడు... అదో జీవితం! ఈ మూడు నాలుగేళ్లుగా విందామన్నా వినబడటం లేదాయె!... కోతలు, నూర్పిళ్లు... ఎవరి పనులు ఎంతదాకా వచ్చి నయ్యో! ఎవరి పంట ఎంత ఇంటికి చేరిందోనన్న పలక రింపులతో మనుషుల కోలాహలం!... వీధులన్నీ ఎంత కళకళగా వుండేదీ?

అట్టా తలపుకు రాగా! "... ఏమబ్బా! పొలాలన్నీ అట్లా బీళ్లు పడిపోయే! వూరక అట్లా పడేసి వుంచక పోతే!... అయ్యేవో వచ్చేదాకా ఎవరిది వాళ్లం దున్ను కుందుం గదా!" పైకే అన్నాడు.

"ఆ నువ్వడక్కా..." ఎకసెక్కంగా అన్నాడొక ముసలాయన.

"ఇంకెక్కడి చేండ్లురా నాయనా! అయినా నీ చేని ఎక్కడుందో పుల్లగాని గుచ్చావేందిరా నాగాయ్? ఇంకా చేనూ, చెట్టూ కలరింతగా వుండేందిరా!" కోటయ్య యాష్టగా అన్నాడు.

"అయినా ఎవురి చేను ఎక్కడుందో... ఎవురి గట్టు ఏదో ఎవురి కెరికా! అంతా మైదానం మాదిరి చదరం జేసి పారేత్తిరి. అదంతా మనం పంటలు తీసిన భూమి మాదిరిగా వుందా! మెత్తగా గుల్లబారి వుండే నేల. దున్నక వదిలేత్తే అంతా తుప్పలూ, రేగిముళ్లూ... చట్టుబండైపోయింది," తిరిగి ఆయనే నిట్టూర్పుగా ముగించాడు.

"ఒరేయ్ నాగన్నా! ఎందుకురా దిగులు... మన హయాం అవనే అయిపోయింది. అసలు దిగులు పడాల్సినా పిల్లగాళ్లు చూడ్రా! ఎట్టున్నారో! ఏ కోశానన్నా దిగులూ, ఇశారం వుందంట్రా! ఆ ఆట చుట్టూ చేరి ఎట్టా కేరింతలు కొడుతున్నారో! చూడు!"

అప్పటికి పన్నెండు కావొచ్చింది. పొద్దు మబ్బుల్లో నుండి బయటికొచ్చింది. చలికి బిగుసుకుపోయిన శరీరాలు ఎచ్చటి ఎండ వేడికి విచ్చుకుంటుంటే హాయిగా అన్పిస్తోంది.

ఆటల దగ్గరున్నోళ్ల అరుపులూ, కేకలూ వినబడుతున్నాయి. పులి-మేక ఆట మంచి రంజులో వుంది. చుట్టూ జనం చేరి ఆడుతున్న వాళ్లకు ఉచిత సలహాలిస్తున్నారు. అంతకు మించి ఉద్రేకపడిపోతున్నారు.

దానికి కొద్ది అవతలిగా పేకాట దుకాణం పెట్టారు. ప్లాస్టిక్ సంచులతో కుట్టిన పెద్ద పట్టా పరచి వుంది. పదిమంది పైనే వున్నారక్కడ. అక్కడా ఆడే వాళ్లు కొందరూ... సలహాలు చెప్పేవాళ్లు మరికొందరు. పేక కలిపి ముక్కలు వేశాక ఒక్కొక్కటీ పేర్చుకుంటూ... జోకరు రాలేదని... పేక కలవలేదని వేసినవాడిని వెక్కిరిస్తూ ఆట షురూ చేశారు.

వరుసగా ముక్కలు కింద పడిపోతున్నాయి. ఎవడేం ముక్క తీస్తున్నాడో, ఎవడి సెట్టు ఎట్టా పేరుస్తున్నాడోనన్న రంధితో అందరిలోనూ ఒకటే టెన్షన్. ఆడకుండా అందరి పేకల్లోకి తొంగి చూస్తున్నవాళ్లది మరో రకం. సలహాలివ్వాలని కోరిక. ఆడుతున్నవాళ్లు అవకతవకలు చేస్తున్నారని గొప్ప బాధ... ఒక్కమాట జారారంటే ఉతికేస్తారన్న దడుపు... అటూ ఇటూ చూస్తా నుచ్చర్లు కొడతా మరింత టెన్షన్ పడిపోతున్నారు.

ఇంతలో పులి-మేక ఆటకాడ గల్లంతుగా కేకలు... పులి ఆటలు కట్, "ఇక నీ పులి కదలలేదురా! అయిపోయిందిరోయ్...!" అని అరిచారెవరో!

"ఒరేయ్ మేకలు పులిని కట్టెయ్యటమేందీ? ఆడటం చేతకాకపోతే సరి! వెధవ!" అన్నాడు మోహన్రావు.

అతని మాటకు ఓడిపోయిన వాడికి రోషమొచ్చింది. "అయితే నువ్వే ఆడు మరి! పోటుగాడివి," అన్నాడతను.

"ఆ ఆడి చూపిస్తా! మేకల్ని పులి చంపితే నువ్వు ఓడినట్టు... లేకపోతే నేను ఓడినట్టు! పందెం కాయి మరి," సవాల్ విసిరాడు.

"సాయంత్రం పేటకు పోతాంగా! నీ ఖర్చు నేనే పెట్టుకుంటా!"

తిరిగి ఆట ప్రారంభమయింది. ఆటగాళ్లిద్దరూ సమవుజ్జీలు. గంట గడిచినా ఎవరి కాయా చంపుడు పడలేదు. అందరిలోనూ ఉత్సుకత పెరిగింది. ఆట రస పట్టులో వుంది. ఆట అయితే తిండికి పోవాలని కూర్చుంటే... అది అయ్యేటట్టుగా లేదని, కొందరు లేచిపోగా కొత్తగా మరికొందరు అన్నాలు తిని సిగరెట్లు కాల్చుకుంటూ అక్కడికి చేరారు.

ముసలోళ్లు అటువేపు చూస్తూ, "ఆరోజుల్లో ఇట్టా పనిలేనట్టుగా తోచుబడి కానట్టుగా వుండేదా? తెల్లారిందంటే పొలాన తిరుగుతుండేవాళ్లం... ఈ ఈడు పిల్లలు భూమిని పగలగొట్టి పంటను పిండాల్సిందిపోయి... ఆటలాడుకుంటున్నారు... ఆటలు," నిరసనగా గొణుక్కున్నారు.

"పనే లేకపోతే వాళ్లు మాత్రం ఏం చేస్తారురా! మనం అనుకోటమేగానీ..." కోటయ్య సాలోచనగా అన్నాడు.

"నిజమేలేగానీ! ఇట్టా ఆడీ ఆడీ విసుగుపుడితే అప్పుడేం చేస్తారూ!"

"చేసేదానికేముందిరా! భూమా పుట్రా... ఇట్టా పనీపాటా లేకుండా పుచ్చిపోయి... ముసలం పుట్టిపోతారు... అంతకంటే జరిగేదేందీ?"

ఆ మాటలకు వాళ్ల మనసులు భారంగా అయ్యాయి. మౌనంగా ఒక్కొక్కరే అరుగు దిగి ఇళ్లవైపు అడుగులు వేశారు.

నాగన్న ఇంటికి చేరాడనేగానీ ఆట దగ్గరున్న కొడుకు చుట్టూనే తిరుగుతోందని మనసు. తన కొడుకే కాదు ఊళ్లో నడీడు పిల్లలంతా అట్టానే వున్నారనుకున్నాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. నిలబెట్టి వున్న మంచం వేసుకుని నడుం వాల్చాడు. పడుకున్నాడనేగానీ ఆలోచనలతో కునుకు పట్టలేదు.

'అసలు వాళ్లుగాదు... నేను మాత్రం ఏం చేస్తున్నట్టూ!' విచారం కలిగిందతనికి. ఏ మనిషికైనా ఏం చెయ్యాలో దిక్కు తోచకపోతే బతగ్గలడా! అట్టా అనుకుంటుంటే లోపలేదో చెయ్యి పెట్టి కెలికినట్టు కుడితి కుడితిగా అయింది నాగన్నకు. ఏమీ పాలుపోలేదు.

లేచి కూర్చోని, "ఏమే! కాసిని మంచినీళ్లియ్యవే!" అన్నాడు చిన్నగా. ఎక్కడ నుండీ శబ్దం రాలేదు. కాసేపాగి, "ఏమే!" అన్నాడు గట్టిగా మరోసారి.

ఆ కేకకు వాకిట్లో పడుకున్న అత్తకూ, లోపల పడుకున్న కోడలికీ మెలకువ వచ్చింది.

"ఏందంట గత్తరా! అట్టా కునుకుపట్టిందో లేదో!" విసుక్కుంటూ లేచింది సుబ్బమ్మ. గ్లాసుతో నీళ్లిస్తూ, "ఏం? లేచి కాసిని ముంచుకు తాగితే ఏం బోయిందీ?" అంది.

అత్త మాటలకు కొనసాగింపుగా, "ఆయనకు నిద్దరపట్టదుగా, అందుకే నిదరబోయే వాళ్లని లేపొద్దూ!" అంది కోడలు. మంచి నిద్రలో ఉండగా మెలకువ వచ్చిందన్న విసుగుదలతో.

కోడలి మాటకు ఛర్రున కోపం వచ్చింది నాగన్నకు. భార్య ఇచ్చిన గ్లాసు అందుకుని రెండు

గుక్కలు గొంతులో పోసుకుని గ్లాసెడు నీళ్లూ పార బోశాడు.

దానితో సుబ్బమ్మకు చిర్రెత్తి గ్లాసు విసురుగా లాక్కుని అవతలకి పోయింది.

భార్య చర్యకు మనసు మరింత చిన్నబోయింది. 'వీళ్లకు మంచినీళ్లియ్యటం కూడా కష్టమైపోయిందే,' అనుకున్నాడు. లోపలంతా ఏదో రంధి రంధిగా చికాగ్గా అయిపోయిందతనికి. మంచంమీద కూర్చోలేకపో యాడు. దానితో మంచం మీద కండవా గట్టిగా విది లించి భుజాన వేసుకుని చెప్పులేసుకుని బజార్లో కొచ్చాడు.

జనం కన్ను కునికే వేళ. ఊరు ఒక మాదిరి నిశ్శ బ్దంగా వుంది. అక్కడొకటీ, అక్కడొకటీ టీవీ మోతలు వినబడుతున్నాయి. చిన్నపిల్లలు గోలీలాడుకుంటు న్నారు. పేకాట, పులి-మేకా దగ్గర కూడా జనం సర్దు కున్నారు.

ఇంటి దగ్గర బయలుదేరినప్పటి రోషం బజారు దాటి దక్షిణానికి తిరిగేటప్పటికి చల్లారిపోయింది. ఇళ్లు దాటి కొద్దిగా ముందుకు నాలుగడుగులు వేసి ఊరి వెలుపలికి వచ్చాడు. ఎదర చూడగానే ఎప్పటిలాగే కొట్టిపోసిన పొలాలన్నీ రూపు మారిపోయి ఏకచదరంగా కళ్ల ముందు దర్శనమిచ్చాయి.

ఆ ఆరులైన్ల రోడ్డును ఎప్పుడు చూసినా నాగన్నకు కడుపులో తెములుతుంది.

అంతే చటుక్కున ఉత్తరం వైపు పాత బండిబాట వేపు తిరిగిపోయాడు. అస్తవ్యస్తంగా తుప్పలు పెరిగీ... గుంటలు తవ్వీ భూమంతా గాయపడినట్టుగా వుంది.

ఓసారి చూపు దీర్ఘంగా సారించాడు.

అప్రయత్నంగా నిట్టూర్పు వెలువడింది.

తలొంచుకుని చేలకు అడ్డంగా బడి నడిచాడు. ఒకే ఒక్క కొండ గుర్తుగా మిగిలిన వేపచెట్టు దగ్గరకు చేరాడు. ఆ చెట్టు నీడెందుకో అతనికి తల్లి చెంత చేరి నట్టుంటుంది. చుట్టూ కలియజూశాడు. అంతా చిట్టడవై పోయింది. 'రైతు చేతిలో నుండి భూమి లాక్కుని ఇట్టా చెయ్యడమేందీ? తింటానికి తిండిగింజలు కూడా కరు వైతే రైతు ఎన్నాళ్లు బతుకుతాడూ?'

'కందేనా, సెనగేనా, పెసరేనా ఎన్ని దినుసులు కానరాకుండా రైతును ఏడాదంతా కాపాడేయీ! ఎంత నిండుగా వుండేదీ? ఇప్పుడన్నీ చూసిచూసి తినాల్సి వస్తుంది. కమ్మగా ఇంట్లో వేసుకున్న కందిపప్పు, ఇంత నెయ్యి వేసుకుంటే కంచండు తినేది కడుపునిండా! తృప్తి తీరా పప్పు తిని ఎన్నో ఏళ్లయినట్టుంది...' నాగన్నకు గుటకలు పడ్డాయి.

మనుషులతో కళకళ్లాడే పంటలు పొలాలు... దొంగ కూడా రాని చోటులయ్యాయి. విత్తనం వేసిన కాడ్నుంచి కాయ ముదిరి శనగ దున్ని కాయ కల్లం అయ్యేదాకా... చుట్టుపట్ల ఆసాములంతా రేత్రిపూట కూడా చేలమీద పొరాడతా వుండేది.

శనగిత్తు ముదిరిందంటే... పిల్లలు చేలమీద వాలి పోయేది. అప్పుడసలు కాపలా కాయటం ఎంత కష్ట మయ్యేదీ? మోహనాను కూడా వద్దన్నా వచ్చి కాయలు తంపట వేసి పెట్టమని ఎంత గోల చేసేవాడో? నాగన్న ప్రాణం కొట్టుకలాడసాగింది.

'తంపట' వేస్తే చేతుల నిండా ఎంత మసో?... మోహనా ఆత్రంకొద్దీ ఆ కాలే కాలే బూడిదలో చేతులు పెట్టి ఏరుకుంటా... సుర్రుమన్నప్పుడల్లా చేతులు నిక్కరుకు పూసుకోవడంతో కాయలు ఏరుకోవటం అయ్యేతలకి వొళ్లూ ఇళ్లూ మసి మంగలం అయ్యే వాడనుకో!

అయినా వాడి మొహంలో వెలుగు తనకెంత కడుపు నింపేది.

నాగన్న ఆలోచనలన్నీ ఎక్కడో తిరుగులాడ సాగాయి.

ఎండుపుల్లలు ఏరుకొచ్చి... శనగమొక్కలు పీకి దానిమీద వేసి నిప్పుల్ల అంటించాడు. ఎండుకట్టె గనగన లాడతా వుంటే మాడిపోకుండా కాయ అటూ ఇటూ పుల్లతో తిప్పుతున్నాడు. మోకాళ్ల మీద చాచిన చేతులు అతనికి తెలియకుండానే అటూ ఇటూ తిరుగు తున్నాయి. కళ్ల వెంట కన్నీళ్లు జాలువారుతున్నాయి.

అట్టా ఎంతసేపున్నాడో తెలియలేదు. ఇంతలో అతని ఏకాగ్రతను చెదరగొడుతూ ఎక్కడో పాము పట్టిన ఎలుక దీనస్వరం చెవుల్లో పడింది. ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చి చుట్టూ కలియజూశాడు. ఎక్కడా జాడలేదు.

తిరిగి తన ధోరణిలో పడిపోయాడు.

ఏమైందీ జనానికి? వాడు డబ్బులిస్తామనగానే ఎందుకిచ్చారిదంతా... జలజలా కన్నీళ్లు పంచె మీదకు జారాయి.

ఇప్పుడు భూమీ, పంటా, కాయలేనా లేంది? భూమితో పాటు బుద్ధులు మారిపోతున్నాయి కాదా! తనకుగానీ, ముసల్దానికిగానీ తినమని అంత చేతిలో వేసేదెవరూ! కొడుకూ కోడలూ బండేసుకొని వారానికీ

పదిరోజులకీ పేట పోతారు. వచ్చేటప్పుడు సంచుల నిండా తెచ్చుకుంటారు. ఏం తెచ్చుకుంటారో మరి?...

అట్టా అనుకుంటుంటే తన మీద తనకే రోత వేసింది నాగన్నకు.

నిజానికి నాగన్నకు తిండి మీద ఏనాడూ అంత ధ్యాసలేదు. ఎప్పుడన్నా పొలాన అంత నక్కదోస కాయో... అన్ని వూసబియ్యమో తినేది. మొక్క పీకా లన్నా, పొలకంకి విరవాలన్నా ప్రాణం పోయేది. ఇప్పుడు వూరికే వుండటంతో పళ్లు తీపులు తీసుకున్నట్టయి ఒక్కో సారి గట్టిగా ఏదన్నా తినాలనిపిస్తోంది. 'అయితేనేం చేతిలో మనదంటూ లేకపోతే మనకు మనమే ఎంత పరాయిగా అయిపోతాం,' అనుకున్నాడు.

గతానికీ వర్తమానానికీ మధ్య ఆయనకు పొంతన కుదరడంలేదు.

నిజమే తానిప్పుడు రైతుబిడ్డ కాదు. గెడ్డ జారిపో యింది.

జరిగిపోయిన కాలం తలుచుకుంటుంటే ఇక తన పనైపోయిందని... భూమి మీదకు తనొచ్చిన కార్యం ముగిసిపోయిందనిపించింది నాగన్నకు.

ఎప్పటి నుండో మంచినీళ్లు తాగకపోవడంతో చల్లగాల్లో కూడా గొంతు ఎండి పోయినట్టయింది. అప్పటికి పొద్దు పడమటికి వాలింది. చలికాలం! ఇంకా ఇక్కడే వుంటే చీకటి అలుముకుని దారి కనబడక ఇబ్బంది పడవలసి వస్తుందని మెల్లిగా వెనుదిరిగాడు.

ఎందుకో ఇంటి కెళ్లాలంటే మనసు మొరాయి స్తోంది. కోడలితో తరచుగా ఇటువంటి అనుభవమే అతనికి ఎదురవుతోంది. ఇంట్లోవారికి తాను ఎక్కు వయ్యానేమోనన్న భావం అతనిని వేధిస్తోంది.

నిన్న మొన్నటిదాకా తన మాట అంటే ఇంటిల్లి పాది ఎంతగా చెవొగ్గేవాళ్లు... ఈ నాలుగేళ్లలో ఎంత మార్పు?... తనదంటూ చిల్లిగవ్వ లేకపోవడం... తను చెయ్యదగ్గ పని లేకపోవడమా?

నెమ్మదిగా పై కండువా తీసుకుని మొహం తుడుచుకున్నాడు.

అప్పటికి కనుచీకటి పడొచ్చింది. ఆ మట్టిబెడ్డల్లో ఎట్టెట్టా తిరిగాడో పంచె నిండా పల్లేరుగాయలు కరుచు కున్నాయి. ఇంటికి చేరేటప్పటికి సాంతం చీకటిపడి ఇళ్లల్లో లైట్లు వేసి వున్నాయి. ఇంట్లో వాళ్లు వాకిట్లోనే వున్నారు.

నాగన్న కనబడగానే అందరూ లోపలికిపోయారు. 'తనకోసమే' చూస్తున్నట్లున్నారనుకున్నాడు. మౌనంగా పంచలో నిలబెట్టి వున్న మంచం మెల్లా మీదకు తెచ్చి వాల్చి పై కండవా దాని మీద వేశాడు. వాకిట్లోకి పోయి గాబులో నీళ్లు ప్లాస్టిక్ డొక్కుతో తీసుకుని కాళ్ల మీద పోసుకున్నాడు. సుబ్బమ్మ ఇచ్చిన నీళ్లు గటగటా తాగి... వాల్చిన మంచం మీద వొరగబడ్డాడు.

అప్పటిదాకా ఎవరేం మాట్లాడలేదు. అందరికీ కోపం వచ్చిందనుకున్నాడు. కొడుకు కోడలు పిల్లలతో టీవీ చూస్తున్నారు. సుబ్బమ్మ మరో మంచం మీదకు చేరి కూర్చుంది.

గంప కింద కప్పెట్టిన కోళ్లు ఇంకా కునుకు పడక కొక్కొమంటూనే వున్నాయి. గేదెలున్న వాళ్లు పాలు పిండటానికి దూడలను విప్పారు. దూడలు చెంగున తల్లి దగ్గరకు దూరి చేసే ఆరాటం... అది చూసిన తల్లుల చిరు అరుపులు... అక్కడో చిత్రమైన ధ్వని వ్యాపించి హాయిగా వుంది.

ఇంట్లోవాళ్లు ఎక్కడి వాళ్లక్కడ సద్దుమణిగారను కున్నాక ముసలాడిని మందలింపుగా, "నిన్నిప్పుడేమన్నా నని... ఇచ్చిన నీళ్లు కూడా తాగకుండా పారబోస్తివి. ఎట్లా బోతుండావో చెప్పకపోతివి! ఎక్కడికని పోయావను కోవాలి?... దున్నేది లేక పొలమంతా పుట్టలు పెరిగి పోయి పగులే ఇంతింత తాసులు తిరుగుతుండె! ఇంత వరదాకా ఆ తుప్పల్లో దేనికుండట్టూ! రానురాను మతి పోతంది! పోయిన భూమి పోనేపోయా! ఇంకా దేని కాడికి? మనదవుద్దా? ఇంట్లో వాళ్ల మీద కోపమొత్తే ఆ వేపచెట్టు కింద శిథిలమైపోతుంటివి. అక్కడేమన్నా తవ్వెపెట్టినవా!..." యాష్టగా అంది సుబ్బమ్మ.

"అన్నీ తవ్వి పోసినోడు ఆ వేపచెట్టెందుకు కొట్టెయ్యలేదో?" అనీ అన్నది.

మనసు కష్టపెట్టుకున్నానని నాగన్న ఎక్కడెక్కడ తిరుగుతున్నాడోనన్న బాధ... ఆమెను ఇంతవరదాకా కలచివేసింది. ఇప్పుడేమో పైకి ఇంకేదో రొల్లుతోంది. అప్పటిదాకా కోడలిని అనలేకా... మింగలేకా వున్న బాధను భర్త మీద చూపించింది.

ఎట్టాగూ! నీళ్లిచ్చింది తనేనాయె! ఆ పై మాట అనకపోతే ఏంబోయిందీ? ఆ మాటే తనంటే మీదపడి పెరికినంత పని చేసేవాడు. తావసం తీరిపోయేది... అన్నది కోడలాయె! ఎదురు అనలేక రోషమొచ్చి చెప్పుల్లో కాళ్లు పెట్టుకుని అదే పోతపోయె!... భర్త అలి గాడని అనుకుందామె. ఆమె కూడా కోడల్ని ఏమీ అన లేక మిన్నకుండిపోయింది.

భార్య మందలింపులు నాగన్నకు ఎక్కడో సంతృప్తిని కలిగించాయి. తనకోసం బాధపడే మని

షుందని... తనకింకా ఈ ప్రపంచంతో లింకు తెగిపో లేదని.

మోహన్రావు టీవీ చూస్తున్నా చెవులు మాత్రం బయటే వుంచాడు.

తల్లి మాట్లాడ్డం ఆపిందో లేదో... ఇంట్లో కొడుకు ఏదో అనడం వినబడింది. ఏమన్నదీ అర్థంకాలేదు. తననేననుకున్నాడు నాగన్న.

''ఊరుకోండి! అయిపోయిందిగా! మళ్లీ ఎందుకూ...'' కోడలు అనడం వినబడింది.

''ఏందే! అయిపోయేదీ? ప్రతిదానికీ! చిన్న పిల్లాడు చేసినట్టూ...'' కొడుకు మాటలకు నాగన్నకు మనసులో గుచ్చుకున్నట్టయింది. సంభాషణ ఆగిపో యింది.

సుబ్బమ్మ లేచి నీళ్లు తోడి జాలాదిలో పెట్టి వచ్చింది. నాగన్న గోచీ కట్టుకుని స్నానానికి పోయాడు.

ఇంట్లో టీవీ మోత ఒక్కటే వినబడుతోంది.

*

నాగన్నకు మనసులో ఏదో తీరని వ్యథ వెంటాడు తోంది. తరచుగా తండ్రి గుర్తు కొస్తున్నాడు. అయ్య పోయి అప్పుడే పదేళ్లయిపోయిందనుకున్నాడు. ఇన్నాళ్లూ పని రంధిలో ఎప్పుడోగాని తలపుకొచ్చేవాడు కాదు. తన తండ్రి చనిపోయేదాకా జీవితం మీద ఎంత ఆసక్తిగా వుండేవాడూ? ముసలివాడినైపోయానని అనుకున్నట్టే వుండేది కాదు.

పొడుగూ మట్టమూ కాని ఎత్తు... నల్లటి దేహం... బట్ట నెత్తి... మోకాళ్ల దాకా మడిచి కట్టిన పంచ... భుజం మీద కండవాతో తండ్రి రూపం ఎదురుగా వున్నట్టే అయింది.

ఓపిక తగ్గి వూళ్లోనే తిరుగుతున్నా ఎంతగా ఎక చకాలాడుతుండేవాడు. దారినపొయ్యే వరసైన ఆడోళ్లను ఏదో ఓ తులిపిమాట! 'పిల్లా! నా అంత మంచోడు దొరుకుతాడంటే! నన్ను చేసుకోరాదూ,' అనో, మరొకటో అనేది. 'ముసిలోడివైనా చాత్రీకం తగ్గ లేదే నీకు!' అని తిరిగి అనిపించుకుని నవ్వుకునేవాడు.

తండ్రిని తలుచుకుంటూ తనిచ్చిన ఎకరాకు తోడు ఇందిరమ్మ ఇచ్చిన ఎకరం పెట్టుకుని... తను తల్లీదండ్రీ ఆదిగా పూటకు ఆరు కంచాలు లేసేవి. అయినా మౌలా సాయిబు అమ్మకానికి పెడితే వున్న దానికి తోడు మరింత అప్పు చేసి అదీ కలుపుకుని... ఈ ముప్పై ఏళ్లుగా గుట్టుగా నెట్టుకొచ్చాం.

తండ్రి పక్కకు తొలగి తనకు అరక పట్టించి ఇంటి పెత్తనం ఇచ్చినా తండ్రి లేకుండా ఒక్క పని చేసె రగడు. ఇయ్యాళ ఈ పని చెయ్యాలనుకుంటే... అయ్య తెల్లారేటప్పటికి ఆ పని కాడ వుండేవాడు. శనగ విత్తనం వొలవాలన్నా, కల్లం చెయ్యాలన్నా, వామి వెయ్యాలన్నా ఆ పని ఇంట్లో అందరిదిగా వుండేది.

అయ్యుండగా తను జొన్నకోతకు కూలోళ్లను పిలిచాడా? కొడవళ్లు కక్కులు కొట్టించాడా? అన్నీ ఆయనే!... కంకి ముదిరి కోతకు సిద్ధమయ్యేతలకి కూలోళ్లు కోతకు సిద్ధంగా వుండేవాళ్లు. కోత కోసి కుప్పలు వేసిన కాడ్నించి... కల్లం చేసేదాకా ఆయనది కాని పని ఏముండేది?

తను పనిలోకి దిగేటప్పటికి ఆ పనికి కావాల్సిన సరంజామానంతా కూర్చిపెట్టేది. దాని మూలంగా తన పనెంత తేలికయ్యేదీ?

"ఎందుకీ ముసలాయన ఇట్టా చేల చుట్టూ... ఇంటికాడ నడుం వాల్చక...'' అంటే,

''చేలో పంట పెట్టుకోని ఇంటికాడ కునుకు పట్టుద్దంటనా! వీడు రైతు బిడ్డేనా!'' మందలింపుగా అనేవాడు.

తను ఆయన్ను విశ్రాంతి తీసుకోమంటే... ఆయన నాకు తెరిపి ఇవ్వాలన్నట్టుగా చేసుకొచ్చేవాడు.

అరక దున్ని విత్తనం వెయ్యడమే తన పని... పంట ఇంటికొచ్చేదాకా కంటి పాపలా కాపలా కాసి ఇంటికి చేర్చింది ఆయనే. అయ్యా, అమ్మా పిల్లా పాప లతో కలిసిందే ఇల్లు అని మాత్రమే తెలుసు తమ తరానికి.

ఒకరు బరువు ఒకరు తరుగు అనేది లేకపోయే! ఎవురికి తోచిందీ... చెయ్యగలిగిందీ తలో పని చేసి బండిని లాగేది. బండి ముందుకు నడుపుడే చూసు కునేదిగానీ... వాడివల్లా, వీడివల్లా! లాభమా? నష్టమా? అనేది లేకపోయేది! అది అందరి సంసారం. కాడెద్దులు, రెండు బర్రెలు పాడీ, సూడీ, ఇంటినిండా పాలు మజ్జిగ... ఇప్పుడో?

ఇంట్లో ఇందరున్నా ఒక్క బర్రెను మేపుకునే దానికి లేకపోయే! ఇల్లు దాటి అడుగెయ్యడానికి చోటేదీ? 'కెపారా' వాళ్లు పొలాల చుట్టూ కంచెలు వేసి పహరాలు పెట్టనేపెట్టిరి. తమ భూముల్లో తామే దొంగతనం చేస్తామేమోనన్నట్టు!

అధికారులు వచ్చిన రోజు నాగన్న ఇంటికాడే వున్నాడు. పొలం పేరెత్తగానే ఇంతెత్తున లేచి... ''అసలు

మీరెందుకు వచ్చారూ! మీకెవురు చెప్పారు? మేం అమ్ముతామని...'' అని వాళ్లను సతాయించాడు.

అయినా వచ్చినవాళ్లు తక్కువవాళ్లు కాదు. వాళ్లూ చెప్పాల్సిన పద్ధతిలోనే చెప్పారు. ''ఇదంతా ప్రభుత్వం దయతలచి మీకిచ్చిందే... మళ్లీ ప్రభుత్వానికే కావలసి వచ్చింది... అందుకే మేమే తీసేసుకుంటున్నాం!'' అన్నారు.

''ఏందీ? మీరిచ్చిందీ? మీ ఇంట్లోది తెచ్చిపెట్టారా? ఏంది?... మా తాత ముత్తాతల కాడ నుండి ఇక్కడ్నే వున్నాం. మా పెద్దలేనాటి నుండో పండించుకుంటున్న భూమి... ఇదంతా కొండా గుట్టా! కనబడటంలా... దీన్ని రెక్కలరగదీసి వాలుకు తెచ్చేట ప్పటికే వాళ్ల బతుకులు తెల్లారిపోయాయి... ఇచ్చారంట... ఇచ్చారు. చెప్పొచ్చారు... చాల్లే,'' వచ్చిన వాళ్లను దులిపి వొదిలాడు.

నీతో ఏంటిలే! మీ అబ్బాయితో మాట్లాడతామన్నారు.

''ఏందీ! వాడితో మాట్లాడేదీ! నేను చెప్పిందే వాడు చెప్పేది.''

ఇది జరిగిన ఆరునెల్లకే అంతా అయిపోయింది.

పట్టాకి రెండున్నర లక్ష... డి.కె.టి.కి రెండు లక్షల కాడికి ఇస్తామన్నారు. వాళ్లకు తెలిసిన రేటుకు ఐదింతలు. ఎక్కడి యాభైవేలు. ఎక్కడి లక్షలు.

అదేనా! ఇంటికో ఉద్యోగం. మొదట పొలం లేకపోతే ఎట్టా, ఏం చేసుకు బతుకుతాం అన్నవాళ్లు... డబ్బులూ, ఉద్యోగం అనగానే మెత్తబడ్డారు.

ఉద్యోగం మనుషుల్ని ఎంతగానో లొంగదీసుకుంది. ఉద్యోగం, ఇస్త్రీ గుడ్డలు... ఫ్యాను కింది సీటు... చెమట పట్టని శరీరం! ఓ కల... ఎవరో పూజ చేసుకున్న వాళ్లకు దొరికేది. అలాంటిది ఇంటికొచ్చి తలుపు తడుతోందనేది వారిని ఆశకు లోను చేసింది. దానికితోడు అసలు మీరు యివ్వకపోతే మేమే కోర్టులో డబ్బులు కట్టి తీసేసుకుంటాం అన్నారు.

అయినా నాగన్న పొలం ఇవ్వనని పేచీ పెట్టాడు. కానీ మోహన్రావు వూరుకోలేదు. తండ్రి మీద యుద్ధం ప్రకటించాడు. ''ఈ వ్యవసాయం చేసి పెద్దోళ్లమవు తామా? రెండెకరాల చిండా! బతికినన్నాళ్లూ మీలాగ్గా మట్టి పిసుక్కుంటేగానీ బాగుండదా! మనమొక్కరం చెయ్యడ్డం బెడితే ఆగుద్దా! మాకు చదువున్నా లేకున్నా జరిగిపోయింది? ఈరోజుల్లో చదువు లేకుంటే ఎందుకు పనికొస్తారూ, అప్పుడు బళ్లూ లేవూ, వసతులూ లేవు. ఇప్పుడట్లా కాదు చదవాలంటే సూళ్లూరుపేటకు పోవాల... ఫీజులు, డ్రస్సులు, పుస్తకాలు ఎంత ఖర్చు?

''అయినా అన్నీ పెరిగిపోయినై. లోకం మీ అప్పుడున్నట్టు ఉందా? అప్పుడు అంత సంగటి తిని ఎద్దుముడ్డి పొడుచుకుంటే బతుకెల్లిపోయింది. ఇప్పుడట్లా కుదురుద్దా!''

నాగన్న మాట్లాడలేదు.

తిరిగి అతనే, ''ఇదేదో అనుకోకుండానో, అనుకునో నాలుగు డబ్బులు చేతిలో పడబోతుంటే అడ్డం పెడుతున్నావేంది?''

నాగన్న అయిష్టంగా మొఖం గంటు పెట్టుకు కూర్చున్నాడు.

తండ్రీ కొడుకుల సంభాషణ అత్తకోడళ్లిద్దరూ శ్రద్ధగా ఆలకిస్తున్నారు. కాసేపు ఎవరూ మాట్లాడలేదు. ఓ నిమిషం అట్లా నిల్చొని మోహనరావు వెళ్లిపోయాడు.

కొంచెంసేపయ్యాక సుబ్బమ్మ కలుగజేసుకొని, ''ఊరు పొమ్మంటుంది, కాడి రమ్మంటుంది. మనకెందుకంట. వాడికీ బిడ్డలున్నారు. వాడి బిడ్డల మీద ఆపేక్ష వాడికి ఉండదా? ఇదంతా పాడు చేసుకుంటే రేపు వాడి బిడ్డలు కాదూ బజార్లపడేది...''

ఓ క్షణం ఆగింది.

తిరిగి తనే, ''ఈ డబ్బులొస్తే పేటలో ఎరువుల కొట్టు పెట్టుకుంటానంటున్నాడుగా. పాడు జేసుకుం టాడా?'' మందలింపుగా అంది.

ఎటువైపు నుండీ శబ్దం లేదు.

ఎప్పటికో దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ, ''మీ అందరూ ఒకటై అమ్మదామంటే నేనొక్కణ్ణి అడ్డుపెడితే ఆగుద్దా...'' నిష్టూరంగా అన్నాడు నాగన్న.

ఏది ఎట్లాగన్నా జరగనీ వరసగా మూడొందల ఎకరాల వూరి పొలం అధికారుల చేతుల్లోకి పోనే పోయింది.

రైతులు పాత బాకీలు తీర్చుకోగా మిగిలిన వాటిల్లో మోటారు బండ్లు కొన్నారు. ఇంటి ఆడోళ్లకు బంగారపు వస్తువులు చేయించి పెట్టారు. కొరవా తరవా ఇళ్లు బాగు చేసుకున్నారు. అన్నీ పోనూ చివరికి చేతిలో మిగిలింది చిన్న మొత్తాలే.

అధికారులు ప్రొక్లైనర్లు పెట్టి గట్లూ చెట్లూ అంతా చదును చేశారు. ఎవరి పొలం ఏదో తెలియకుండా ఇది నాది అనే గుర్తునీ, నమ్మకాన్నీ రద్దు చేశారు.

అట్టా ఓ రెండు మూడు సీజన్లు గడిచిపోయాయి. 'కెపారా' రాలేదు. ఉద్యోగం లేదు. బ్యాంకుల్లో డబ్బు

కరగడం ప్రారంభమయింది. కుర్రకారుకి ఏం పని చెయ్యాలో తెలియడం లేదు. వూళ్లో పొలం లేదు. టౌన్లో వీళ్లు దేనికీ చెల్లలేదు.

మోహనరావు మాత్రం చిన్నగది తీసుకొని ఎరువుల కొట్టు తెరిచాడు. అయితే చుట్టుపక్కల భూములు, వ్యవసాయం తగ్గిపోవడంతో అంతగా వ్యాపారం సాగలేదు. పైగా వ్యాపారానికి కొత్త. పెట్టుబడి బిగిసిపోయినట్టయింది. చేతిలో డబ్బు ఆడక ఇబ్బంది పడసాగాడు. భవిష్యత్తు మీద ఆందోళన ప్రారంభమయింది.

మెల్లిగా అసంతృప్తి జీవితంలోకి దిగుతోంది. అన్నిటి మీదా అసహనం... డబ్బు ఖర్చైపోతే రేపెట్లా? సందిగ్ధం పొడగడుతోంది.

దానితో ముసలోళ్లు పనీపాటా లేకుండా కూర్చోని తింటన్నారనిపిస్తోంది. బియ్యం, పప్పు, ఉప్పులకు ఖర్చు ఎక్కువయిపోతోందని... సణుక్కోవడం పెద్దవాళ్ల చెవుల్లో పడుతోంది.

మరోవైపు ఎప్పటికైనా 'కెపారా' రాకపోద్దా! ఇన్ని కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వం 'కెపార'కి కాకపోతే ఇంకో కంపెనీకి యివ్వకపోద్దా! పిల్లలు చదువుకుని వుంటే వాళ్లకైనా ఉద్యోగం వస్తుందని... లోపలేదో ఇంకిపోని ఆశతో పిల్లల్ని మాత్రం బాగా చదివించాలనుకుంటున్నారు. సూళ్లూరుపేట ఇంగ్లీషు బళ్లకు పంపుతున్నారు.

ఊళ్లోకే ఆటో వచ్చి ఏడెనిమిదిమంది పిల్లల్ని ఎక్కించుకునిపోయి... సాయంత్రం దించటం... వతనుగా వచ్చిపోతుంది. మోహన్రావు తన కొడుకునూ పేటలో చేర్చాడు.

ఇక మోహన్రావు ఎండెక్కిందాకా జెండా చెట్టు కాడో... పోలేరమ్మ గుడికాడో... లేకపోతే ఏ 'ఆట' కాడనో కాలక్షేపం చేసి... అన్నం తిని ఓ కునుకు తీసి... మోటారుబండి ఎక్కాడంటే ఏ రాత్రికోగాని తిరిగి రాడు.

అతనేకాదు... ఆ వూళ్లో కుర్రకారంతా అదే దోవ.

ఎటొచ్చీ ముసిలోళ్లకే ముంచుకొచ్చిందనుకున్నాడు నాగన్న.

మనిషి జీవితం ఇంత దుర్భరమని తానెన్నడూ అనుకోలేదు. పంటలు లేక! కరువు వాతన పడ్డప్పుడు గానీ, అయినవాళ్లు పోయినప్పుడుగానీ... మరింకే కష్టంలోనూ నాకు నేను బరువుగా అనిపించలేదే? జీవితంలో దుఃఖాలూ, బీభత్సాలూ, మరణాలూ తనను కదిలించలేకపోయాయి... ఇప్పుడు... ఇప్పుడు మాత్రమే వంటరిననిపిస్తోంది.

ఇప్పుడేమీ పనిలేనట్టు... భూమిమీద ఏ బంధమూ లేనట్టూ... ఇంత నిష్క్రియగా వుండటమేమిటీ? తన తండ్రికున్నపాటి జీవితానురక్తి తనకెందుకు లేకుండా పోయినట్టూ?... తనకీ మనవడూ, మనవరాలూ అందరూ వున్నారుగా!...

*

కాలం ఏ బిందువు దగ్గరా ఆగదు కదా!

తరచుగా ముసలోళ్లు అరుగు మీద చేరినప్పుడల్లా తమ వెతలు వెళ్లబోసుకుంటూనే వుండారు. ఇంటింటికీ ఇవే కథలు.

"లేదు లేంర్రా! పొలం లేకపోవడమొక్కటే కాదు లేరా! అయినా భూములు పోయింది ఈ నాలుగేళ్ల సందేగా! ఇంతలోనే ఇది రాలేదుగానీ!" సాలోచనగా అన్నాడు కోటయ్య.

రాత్రి బువ్వలు తిని గుడి అరుగుమీద చేరారు. ఉగాది వెళ్లిపోయింది. ఇంట్లో కంటే బజార్లో చల్లగా వుంటుంది. మబ్బులు లేని ఆకాశంలో చుక్కలు ప్రకాశవంతంగా వున్నయ్యి. వెన్నెల ముసలివాళ్లను సేద తీరుస్తోంది.

"అసలు పొలాన పనిజెయ్యడం నామోషీ కింద మారిపోవడం... చేసినా, ఏం లాభమని జనానికి అనిపించడమే మొదలనుకో! జొన్న, కందీ పోయి... ఈ బోర్లు వచ్చి కొత్తెగసాయం రావటం... అయ్యి ఒకేడు ధరుంటే, ఇంకో ఏడు వుండక నష్టాలు రావటం, అంతా జూదమే నయ్యో!... చేతి నిండా డబ్బులున్నట్టే వుండే... అప్పులూ మిగులుతుండె..." అరుగు మీద వాళ్ల అనుభవాల చర్చ ఎప్పటికీ సాగుతూనే వుండేది.

"అప్పులూ గిప్పులూ కాదులేంర్రా!... అందుకే ఎగసాయం మీద మనసు బోయిందంటారా! వట్టి మాట... అప్పులైనా ఎవుడు లెక్కచేసిందీ? కొత్తెగసాయం వచ్చాక చేతిలో దుడ్లు ఆడుతుండ్లా!" ఎవరో అందుకున్నారు.

"ఇంతలోనే వూళ్లోకి టీవీవొచ్చె. టీవీలల్లో ఎన్ని రకాల వస్తువులు చూడటంలా... అయ్యన్నీ కాకపోయినా కొన్నన్నా కొనాలంటున్నారుగా ఆడంగులు... అసలప్పటి నుంచే పిల్లకాయల్లో చలవ బట్టలేసుకుని తిరగాలని కోరిక పుట్టిందిలేరా...!" కోటయ్య తన పిల్లల్ని తలుచుకున్నాడు.

"అవున్రా! మావాడు చదివింది రెండో కలాసే... అయినా దానికే వాడు పొలంలోకి దిగాలంటే ఎంత ఇదైపోయేవాడూ?" కొడుకు పనులు తల్చుకుంటూ, "మా వాడేందీ? ...ఈ వూరు కుర్రోళ్లు పదేళ్లుగా మట్టిలో దిగి ఎగసాయం చేసినోడేడీ? అంతా కూలీల పెట్టేనాయె! నట్టం రాక ఏమొచ్చుద్దీ."

''అవున్లే వీళ్లిట్లా పనిచేసేదానికి పంజలయ్యారు గనకే... వాళ్లూ అట్టా పొలాలు లాక్కోగలిగారు. 'ఇయ్యి పోతే ఎట్టారా? బతుకు' అనుకుంటే కట్టుగా వుండే వాళ్లు గాదూ?... అప్పుడు వాడు మాత్రం ఏం చేసేదీ?'' కొడుకు పొలం అమ్మమని గోలచెయ్యడం నాగన్నకు జ్ఞాపకానికి వచ్చి నిట్టూర్చాడు.

''అసలు పల్లెటూళ్లకి ఈ ఆటోలు వచ్చి సూళ్లూరుపేటకో, నాయుడుపేటకో పోయేది మరి గారు... ఇగ వూళ్లో వుండి ఎగసాయం ఏం చెయ్యబుద్ధ వుద్దీ... అప్పుడే సొంతం వూరు మారిపోయింది...'' ఒకరి వెంట ఒకరు సంభాషణ సాగుతోంది.

''అసలు వూళ్లల్లోకి ఆటోలు రాసాగినాక ఎవరి మాటా ఎవరూ లెక్కచెయ్యటం పోయింది. అప్పుడు సూళ్లూరుపేటకు సినిమాకు పోవాలంటే... ఏడాదికో, రెండేళ్లకోగాని పోయేదిగాదు. పండక్కి గుడ్డలు కొనా లంటే ఊళ్లోకి వచ్చిన మూట్ల మస్తాన్ దగ్గరే కొనేది. ఇప్పుడో? రోజూ పేటకేగా! చూసిన గుడ్డల్లా కొంట న్నారు.''

ఆ మాటలు వింటుంటే తన కొడుకు రోజుకో కొత్త వస్తువు తేవడం గుర్తుకొచ్చింది నాగన్నకు. తను వున్నయ్యి కాసిని అయిపోతయ్యేమోనన్న భయంతో... ఎందుకురా ఇయ్యన్నీ ఇప్పుడూ! అంటే వాళ్లకెంత కష్టంగా వుంటుందో...

అరుగు మీద చేరాలంటే ముసలోళ్లు, ఇంటికి పోబుద్ధికానట్టు ఏవేవో తలపోసుకోవడంతో సరిపో తుంది.

నాగన్నకూ ఇంటికి పోవాలనిపించడంలేదు. అక్కడ తనతో మాట్లాడే మనిషి లేనట్టుగా వుంటోంది. పైగా తను అడ్డంగా వున్నట్టనుకుంటున్నారేమోనన్న ఆలోచన మరింత బాధిస్తోంది.

పొద్దుటిపూట ఇంట్లోకిపోతే... కోడలెక్కడ విసురు కుంటుందోనని... దూరదూరంగానే వుంటున్నాడు. కారేజీ... బూట్లు... డ్రస్సులు... ఆటోకి ఆలస్యమవుతుం దని కోడలు పడే హైరానా అంతా ఇంతా కాదు. అప్పుడు ఇంట్లోకి పోతే, వెళ్లిన వాళ్లమీద విసుక్కుంటుంది. అట్టా అనిపించుకోవడం నాగన్నకు ఇష్టముండదు.

ఆమె సంగతి కన్నా మనమడు తనకు కాకుండా పొయ్యాడన్నది మరింత దిగులుగా వుంటోంది. తన తండ్రికీ తన కొడుక్కి ఎడబాటు వున్నట్టు తనకెన్నడూ తట్టనే లేదు. తండ్రి తన అనుభవాలను మనమడికి తెలియకుండానే ఎలా అందించేవాడు?

మోహనా బుడ్డిదీపం ముందు కూర్చోని, 'అశ్వని, భరణీ...' అనో, 'చైత్రమూ, వైశాఖమూ...' అనో కార్తెలు, నక్షత్రాల పేర్లు చదువుతుంటే... అవన్నీ మనకు సంబంధించినవే గదా అనిపించేది. పుస్తకాల్లో కూడా అవే వుంటాయనిపించేది.

మోహనాను పక్కలో వేసుకుని... వాడికి ఎన్ని నేర్పాడు. ''వైశాఖలో గాలి విసరకుండా వుంటే, స్వాతమ్మ చల్లగా చూస్తే... అనూరాధలో ఆరోగ్యంగా వుంటయ్యిరా పంటలు. అప్పుడు రైతుల కళ్లు నవ్వు తాయి... లోగిళ్లు నిండుతయ్యి.''

''...అవన్నీ లేవు తాతా దీన్లో! వట్టి పేర్లే...'' మోహనా.

''అయ్యన్నీ బొక్కుల్లో వుండవురా! అయ్యి రైతు అనుభవంలో వుంటయ్యిరా మనవడా!'' నిండుగా నవ్వుకునేది. కానీ ఇప్పుడు తన మనవడికీ తనకీ మాటలే తక్కువయిపోయినయ్యి. తండ్రి గుర్తురాగా, 'ఎంత అదృష్టవంతుడో! తృప్తిగా బతికిపోయాడు,' మనసు బరువుగా అనిపిస్తోంది నాగన్నకు.

తన మనవడో- తనేదన్నా చెప్పబోతే, 'అసలు నీకేం తెలియదులే తాతా,' అంటున్నాడు. వాడు ఆ కరెంటుబుడ్డి ముందు కూర్చోని ఏం చదువుతున్నాడో అది ఏం భాషో అర్థమే కావటంలేదు. వాడికిప్పుడు మనుషులే నచ్చటంలేదు.

ఈ పేట బడికి పోయిన కాడి నుంచీ ఎప్పుడన్నా పిలిచి పక్కలో పడుకోమన్నా... 'వాసన తాతా వాసన,' అంటున్నాడు. పక్కలోకే రావటం లేదు. తన మనమడు తనకెప్పుడో దూరమయినట్టే వుంది. ఈ రెండేళ్లలో వాడిలో ఎంత మార్పూ?... వూరు కూడా నచ్చుతున్నట్టు లేదు.

అయినా వాడికీ నాకూ చెప్పుకునే మాటలేము న్నయ్యీ! గొడ్డు గురించా! పంట గురించా! చెలక గురించా! చేని గురించా!... వాడికి ఇంకొన్నాళ్లుపోతే వ్యవసాయమేందో, అరకలు, నాగళ్లు ఏందో ఏం తెలుస్తుందీ?

వాడుసరే! మోహనా, నేనూ ఏం మాట్లాడు కుంటున్నాం? అసలు ఇద్దరికీ దేని గురించి మాటల అల్లిక ఏర్పడుద్దీ?... మొక్క మొలిచిందనా! చీడ పట్టిందనా! పూత వేసిందనా! కాయ కాసిందనా!... పొలమే పోయాక బంధమే తెగిపోయినట్టయ్యింది...

పొలం నుండి వచ్చామంటే... నీళ్లు పోసు కుంటా, అన్నాలు తింటా ఆరోజు పొలాన జరిగిన సంగతులే నడిచేయి... ఇప్పుడు వాడు పేటలో ఏం

చేస్తున్నాడో!... నాకు చెప్పేనా!... నేను వినేనా!... ఇక మనుషుల మధ్య కలబోతలకు కాలం చెల్లి పోయింది.

నాగన్నకు మనుషులంతా ఇక చెల్లాచెదరైపోయి నట్టే వుంది. అందరినీ కలిపి కట్టిపడేసే భూమిలేదు. ఇక్కడ బతుకుతెరువు లేకపోతే ఎక్కడ దొరుకుద్దో అక్కడికి పోవాల్సిందేగా! ఇప్పటిదాకా మోహనా టౌనుకు పోయి వస్తున్నాడు. రేపటి రోజు వీడు టౌన్లోనే వుంటాడు గావచ్చు!... ఇప్పుడిక్కడేముందనీ!...

నాగన్నకు రోజురోజుకూ పనిలేకా, ఏంచెయ్యాలో తోచక ఏదో నిర్వీర్యత... అన్నిటిపట్ల తెలియని నిర్లిప్తత ఏర్పడసాగాయి. క్రమంగా అతని ఆరోగ్యం కూడా పని చెయ్యక మూలన పడేసిన యంత్రం మాదిరి తుప్పు తేలినట్లుగా... ఎక్కడి కీళ్లక్కడ పట్టకపోతున్నాయి. చిన్న చిన్న పనులకు కూడా భార్యను కేకలేస్తున్నాడు.

ఆరోజు... "కండవా యియ్యవే! బజారులోకి పోయొస్తా," కేకవేశాడు నాగన్న!... సుబ్బమ్మకు వినబడ లేదు. మరోసారి పిలిచాడు. ఆమె వెనక సందులో గిన్నెలు తోముతా వుంది. చేతులు ఖాళీ చేసుకుని వచ్చే టప్పటికి కాస్త ఆలస్యమయింది.

సుబ్బమ్మ మీద అంతెత్తున ఎగిరాడు... "పిలిస్తే వచ్చేది లేదా! లెక్కలేకుండా పోయింది!"

ఆమెకూ చిర్రెత్తి, "ఊరికే కూచ్చోని కేకలెయ్యక పోతే... అంత చిన్ని పని చేసుకోకూడదా? లేచి కండవా తీసుకోటానికేంది?" అంది.

దానితో పెద్ద రభస అయింది. ఎప్పటెప్పటివో తవ్వి మరీ పోట్లాట వేసుకున్నాడు. ఈ గోలలో అత్తను మాత్రమే తిడుతున్నట్లుగా అనిపించలేదు కోడలికి. అందులో తమకేదో తగిలినట్లనిపించింది.

ఆమె కూడా మామ మీద నోరు చేసుకుంది. "ఎందుకులే అని వూరుకుంటుంటే... రోజురోజుకు నీ సతాయింపు ఎక్కువయిపోయింది. నువ్వు చూస్తుండగా ఏదన్నా తిన్నా వూరుకోవు... కొత్త వస్తువు కొన్నా ఓర్చు కోవు! ఏందంట?... నీ సొమ్మేమన్నా పెట్టినట్టూ..."

"మొన్నటికి మొన్న ఆ డి.వి.డి. కొనుక్కొచ్చారని అంత రాద్ధాంతం చేస్తివి. ఈయన కాబట్టి సరిపోయింది... ఇంకోరయితేనా!..." ఆమెకు అప్పటి నుంచీ కడుపులో వున్న కోపాన్ని వెళ్లగక్కింది.

కోడలి మాటలు నాగన్నను దిమ్మరపోయేట్టు చేసినయ్యి. వాళ్లు పెట్టుకునే ఖర్చులో తన సొమ్మేం లేదా?... తను కాదా ఆ భూమిని సంపాదించింది. ఈనాటికి నేను పిడికెడు మట్టి కూడా లేని బికారినా?...

రోజూ ఆ 'డబ్బా'లో వచ్చే సినిమాలు చాలక... మళ్లీ కొత్తదేదో కొన్నారంటే కడుపు మండిన మాట నిజం... కానీ ఎవరి మంచి కోసం అన్నానూ!

దాని అవసరం ఉంది. అది కూడా వాళ్లతో కలిసి పోయినట్టుగానే ఉంది అనుకున్నాడు.

మంచంలో అట్టాగే ఉండిపోయాడు. ఆ పూట బజారుకు కూడా పోలేదు.

సుబ్బమ్మకు భర్తను చూస్తుంటే ఎట్టా బతికి ఎట్టా అయ్యాడు?... అని ఓ పక్క దుఃఖంగానూ, మరోపక్క రోజుల్నుబట్టి సరదాగాని ఎల్లకాలమూ మనదే ఆలోచన అనుకుంటే ఎట్టా కుదురుద్ది అనుకుంది. వాళ్లూ మనంతవాళ్లయ్యారని తెలుసుకోడేందీ మనిషి? అని లోపల్లోపల యిదైపోతోంది.

నాగన్న మంచంలో అట్లా ఎంతసేపున్నాడో!

'నా వల్ల దమ్మిడి ఎత్తు లాభం లేకపోయాక ఎవరు మాత్రం ఎందుకు లెక్క జేస్తారు? యిదేమన్నా ఎనకటి రోజులా? పెద్దా చిన్నా అనుకోవడానికి?

'వాళ్లన్నారని కాదుగాని నేను మాత్రం ఊరుకనే ఎందుకుండాల? వొంట్లో యింకా సత్త వుండాక.'

ఆ రాత్రంతా ఆలోచన చేసి, 'భూమంతా వాడు చుట్టబెట్టలేదుగా. ఇక్కడ కాకపోతే యింకోచోట. అటు పడమట పెంచలయ్య కాడికి పోతే ఓ ఎకరా కౌలుకన్నా దొరక్కపోద్దా! చూద్దాం...' అని ఓ నిశ్చయానికి వచ్చాడు.

రోజూ పొద్దుటే ఉండే విసుర్లూ కసుర్లూ లేకుండా పనులు నడుపుకున్నాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. సద్దన్నం తింటానే కండువ భుజానేసుకని సుబ్బమ్మ వింటుండగా, "ఊరికి పోతన్నా," అని గాలిలో ఓ మాట విసిరి కర్ర తీసుకొని పేట రోడ్డు ఎక్కాడు.

*అరుణతార, జులై-సెప్టెంబర్, 2009*

